
ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి


భోజనాలు చేస్తున్న భక్తులు


కల్యాణం తిలకిస్తున్న శివసత్తులు


బోనాలతో వస్తున్న భక్తులు


ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోపీనాథ్

# వైభవంగా కల్యాణం

- ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగిన బల్కంపేట ● లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం ● జనసంద్రంగా పురవీధులు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఏ దిక్కున చూసినా అమ్మవారి భక్తులే... కొందరు వంటినిండా.. మరికొందరు నుదుటన పసుపు బండారుతో.. బల్కంపేట పురవీధుల్లో దర్శనమిచ్చారు. శివసత్తులు, మహిళలు, మరోవైపు యువతీయువకులు, పిల్లలు అమ్మవారి భక్తిలో మునిగితేలారు. దీంతో బల్కంపేటలోని ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం జాతరను తలపించింది. ఉదయం నుంచే బల్కంపేట వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. ఎల్లమ్మ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మరోవైపు కల్యాణోత్సవాన్ని ఆలయం ముందు ఆరుబయట నిర్వహించడంతో నాలుగు వైపులా రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివసత్తులు, ఒగ్గుకళాకారులు ప్రత్యేకవేదికలను ఏర్పాటు చేసుకొని అమ్మవారి భక్తిసాగరంలో మునిగిపోయారు. శివసత్తులు చెర్నకోలలు చేతబూని అమ్మవారి పూనకంతో ఊగిపోయారు. (అమీర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) )


నేలపై కూర్చుని ఎల్లమ్మతల్లి కల్యాణాన్ని వీక్షిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మేయర్ విజయలక్ష్మి, డాక్టర్ కోట నీలిమ తదితరులు


అలంకరణలో ఎల్లమ్మతల్లి


వరుడుగా త్రిశూలానికి అలంకరణ


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

### అన్నదానం, పులిహోర పంపిణీ

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి వచ్చిన లక్షలాది మంది భక్తులకు స్థానిక సంక్షేమ సంఘాలతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా రోడ్ల పొడవునా టెంట్లువేసి ఉచితంగా అన్నదానం, పులిహోర, మంచినీటి ప్యాకెట్లను, స్వీట్లను పంపిణీచేశారు. ఎల్లమ్మపోచమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

### తీవ్ర ట్రాఫిక్‌జామ్

ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు, భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంజీవరెడ్డినగర్ పోలీస్‌స్టేషన్ వైపు నుంచి బల్కంపేటవైపు వచ్చే రోడ్డులో ఎస్ఎస్ బేకరీ నుంచి ఎడమవైపు ట్రాఫిక్‌ను మళ్లించి, అక్కడి నుంచి బీకే.గూడ పార్కు చౌరస్తా, శ్రీరాంనగర్ మీదుగా బల్కంపేట పెట్రోల్‌బంకు వైపు ట్రాఫిక్‌ను అనుమతించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడం, రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు తలెత్తాయి. అదేవిధంగా అమ్మవారి కల్యాణోత్సవం అనంతరం బుధవారం సాయంత్రం రథోత్సవం ఊరేగింపు ఉంటుందని, వందలాది మంది పాల్గొనే ఈ రథోత్సవం రోజు ట్రాఫిక్ వన్‌వే చేస్తామని ట్రాఫిక్‌పోలీసులు తెలిపారు.

### మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటు

ఎల్లమ్మ కల్యాణానికి వచ్చే భక్తులు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా పలు ప్రాంతాల్లో మొబైల్ టాయ్‌లెట్లను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ ప్రాంతాలు అపరిశుభ్రం కాకుండా జాగ్రత్త పడ్డారు. ఈసారి జరిగిన కల్యాణానికి లక్షల్లో భక్తులు వచ్చినట్లు పోలీస్, వివిధ శాఖల అధికారులు అంచనా వేస్తున్నారు.


బోనంతో వస్తున్న జోగిని శ్యామల

పోతరాజుల విన్యాసం


బల్కంపేటలో అన్నదానం నిర్వహిస్తున్న కూతురు నర్సింహ


రేణుకా నగర్‌లో నిర్వహించిన అన్నదానంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి


ఎస్ఆర్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ


అన్నదానం చేస్తున్న ఇందిరానగర్ వాసులు

## నర్సరీ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు... ఉద్రిక్తత

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 1లో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థలంలో కొనసాగుతున్న నర్సరీని ఖాళీ చేయాలంటూ కొంతమంది వ్యక్తులు వచ్చి బెదిరింపులకు గురిచేస్తు న్నారంటూ నర్సరీ నిర్వాహకుడు సత్యనారాయణ నగర పోలీసు కమిషనర్‌తోపాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 1లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ను ఆనుకొని సుమారు 6వేల గజాల సొసైటీ స్థలం ఉంది. ఈ స్థలంలో 25 ఏండ్లుగా సత్యనారాయణ అనే వ్యక్తి నర్సరీని నిర్వహిస్తున్నారు. ఈ స్థలాన్ని 2020లో అప్పటి జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ మంతెన ఎల్ఎల్పీ అనే సంస్థకు లీజుకు ఇచ్చింది. సదరు సంస్థ నిర్మాణ పనులు చేపట్టేదాకా నర్సరీ నడిపించుకోవాలంటూ సూచించడంతో అక్కడే నడిపిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం నర్సరీని ఖాళీచేయాలంటూ కొంతమంది వ్యక్తులు తమను బెదిరింపులకు గురిచే స్తున్నారని నర్సరీ నిర్వాహకుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వల్ల తనకు ప్రాణహాని ఉందన్నారు.

## కత్తితో బెదిరించిన కేసులో రౌడీషీటర్ అరెస్టు

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దారినపోయే యువకుడిని కత్తితో బెదిరించిన కేసులో రౌడీషీటర్ బిల్లాపవన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందిరానగర్‌కు చెందిన ఎస్.హేమంత్ మైండ్‌స్పేస్‌లో పనిచేస్తున్నారు. మే 30న విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న హేమంత్‌ను రౌడీషీటర్ బిల్లా పవన్, ఎం.శ్రవణ్, కె.ప్రశాంత్‌కుమార్ అడ్డుకున్నారు. బిల్లా పవన్ తన వద్ద ఉన్న కత్తితో బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఆయుధాల చట్టంతోపాటు ఐపీసీ సెక్షన్‌ల కింద కేసునమోదు చేశారు. అప్పటి నుంచి బిల్లా పవన్ పరారీలో ఉన్నాడు. ఈనెల 8 అతను అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు.

## పోయిన క్రెడిట్ కార్డు ద్వారా లక్ష మాయం

యూసుఫ్‌గూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తన వద్ద నుంచి పోయిన క్రెడిట్ కార్డు నుంచి లక్ష రూపాయల వరకు చోరీ అయి ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎస్.సత్యసాయిరామ మధురానగర్‌లో నివాసం ఉంటూ జ్యోతిష్యం చెపుతుంటాడు. ఈ నెల 7న తన హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు కనిపించలేదు. అయితే దొరుకుతుందేమోనని వెతుకుతూ కార్డు బ్లాక్‌చేసే క్రమంలో అతనికి రూ.5వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ తరువాత మొత్తం లక్షరూపాయల వరకు వాడినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే కార్డు బ్లాక్ చేయించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వీసా ఇప్పిస్తామని రూ.52వేలు తీసుకుని మోసం

యూసుఫ్‌గూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వీసా ఇప్పిస్తామని ఇద్దరు మహిళల వద్ద నగదు తీసుకుని మోసం చేసిన సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఫ్యాషన్ డిజైనర్ వి.బార్గవి, ఆమె స్నేహితురాలు బోపాల్‌కు చెందిన సినీఆర్టిస్ట్ జయారావుకు ఈనెల 7 నుంచి 9 తేదీ వరకు అమెరికాలో ఈవెంట్‌కు రావాలని ఆహ్వానం అందింది. వీరికి వీసాలేని కారణంగా ఇరువురు తమ స్నేహితురాలు ఉష అనే మహిళను కలిశారు. ఆమె మణికంఠరెడ్డి అనే వ్యక్తిని పరిచయం చేసి తమ కుటుంబానికి వీసా ఇప్పించారని, మోసం చేసే వ్యక్తి కాదని తెలిపింది. దీంతో ఇరువురు రూ.52వేల నగదును మణికంఠరెడ్డికి ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేశారు. నగదు తీసుకున్న తరువాత అతను స్పందించకపోవడంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం.. మహిళ అరెస్ట్

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కల్తీ వైన్ తయారు చేస్తున్న ఓ మహిళను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. తార్నాక విజయపురి కాలనీకి చెందిన గెరాల్డిన్ మిల్స్(54) కొంతకాలంగా ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీవైన్ తయారు చేసి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పోలీసులు ఆమె ఇంట్లో తనిఖీ చేశారు. 112 బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ వైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఆమె గతంలో కూడా కల్తీ వైన్ తయారు చేసి అరెస్ట్ అయిందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో జీహెచ్ఎంసీ ఉద్యోగికి గాయాలు

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో జీహెచ్ఎంసీ స్వీపర్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్‌నగర్‌లో నివసిస్తున్న సుదర్శన్(55) జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను ఆస్పత్రికి తరలించారు. అతడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు 11కేవీ బంగారు మైసమ్మ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు పరికరాలు ఇప్పించండి

ఖైరతాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగర శుభ్రతలో భాగస్వాములుగా ఉన్న కాంట్రాక్టు సిబ్బందికి అవసరమయ్యే పరికరాలు కొద్ది రోజులుగా రావడం లేదని, వాటిని వెంటనే ఇచ్చేలా చూడాలని జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్టుఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మిద్దె కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు యాప్‌లో సాంకేతిక కారణాలు వస్తున్నాయని దీంతో కార్మికులు హాజరైనా రానట్లు పడుతోందన్నారు. దీంతో కార్మికుల వేతనాల్లో భారీగా కోతలు పడుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగడ్డ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ నీలిమ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన గర్భిణుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో గర్భిణులు హాజరై వైద్యసేవలు పొందారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ శ్రీనివాస్ మాట్లాడుతూ నొప్పులులేని ప్రసవం సదుపాయాన్ని అందించడానికి 24 గంటలూ తమ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.



## తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకం


జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.హుస్సేన్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం లలితకళాతోరణంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో యూనియన్ కేంద్రసంఘం నూతన అధ్యక్షుడు మారం జగదీశ్వర్, నూతన ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేన్(ముజీబ్)కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. సకలజనుల సమ్మె ఉద్యమానికి ఊపునిచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించిందని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఎల్లూరి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, జిల్లాకార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

## నాలుగు నెలలుగా జీతాల్లేవ్..?

### ఖైరతాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ధర్నా

ఖైరతాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తమకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో 4 నెలలుగా జీతాలు రావడం లేదని ఖైరతాబాద్ స్థానిక ప్రభుత్వాస్పత్రి కాంట్రాక్టు సిబ్బంది వాపోతున్నారు. మంగళవారం ఆస్పత్రిలో విధులు పక్కనబెట్టి ధర్నాకు ఉపక్రమించారు. ఈ ఆస్పత్రిలో 25 మంది వరకు కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నామని, తమకు ప్రతినెలా రూ.15,600 జీతం రావాలని కానీ రూ.11వేలే కాంట్రాక్టర్ ఇస్తున్నాడని ఆగ్రహించారు. నాలుగు నెలలుగా జీతం రాకపోవడంతో ఇంటి అద్దెలు, తినడానికి తిండిలేక తీవ్రఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది చెప్పారు.



దివ్యాంగులకు పింఛను పెంచాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కొల్లి నాగేశ్వర్‌రావు

## దివ్యాంగులకు పింఛను రూ.6వేలకు పెంచాలి

● మంత్రి పొన్నంకు దివ్యాంగుల వినతి

**అడ్డగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో దివ్యాంగులకు నాలుగు వేల నుంచి ఆరు వేలకు పింఛను పెంచాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావుతోపాటు పులిపాటి శ్రీనివాస్, మనీలు కలిసి మంగళవారం మంత్రి నివాసంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొల్లి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ దివ్యాంగులకు నాలుగు వేల నుంచి ఆరు వేలకు పింఛను పెంచాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం దివ్యాంగుల పింఛను పెంచాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన దివ్యాంగులకు ఐదు లక్షల రుణ సదుపాయం మంజూరు చేయాలన్నారు. రాష్ట్రవ్యాపితంగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని కోరారు. అందుకు మంత్రి స్పందిస్తూ దివ్యాంగులకు పింఛను పెంపునకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.



ఆలయ నిర్వాహకులతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ సైదులు

## శాంతియుతంగా నిర్వహించుకోవాలి

● ఇన్‌స్పెక్టర్ సైదులు

**బౌద్ధనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదులు నిర్వాహకులను కోరారు. మొహరం, ఆషాడబోనాల పండుగలను పురస్కరించుకుని పోలీస్‌స్టేషన్‌లో మతపెద్దలు, ఆలయ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫలహారబండ్లు, తొట్టెల ఊరేగింపునకు ముందుస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేస్తామన్నారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఎస్సై ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులు సాఫీగా ప్రయాణం చేయడానికి వీలుగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు మంగళవారం గుంతలమయమైన రోడ్డును పూడ్చివేయించారు. కేబుల్ కొరకు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు కటింగ్ చేస్తున్నారు. సమాచారం ఇవ్వాలని సూచించారు.

- తిరుమలగిరి జూలై 9 (ఆంధ్రజ్యోతి)



విద్యార్థులతో వ్యాపారవేత్త యాదగిరి తదితరులు

## విద్యార్థులకు బెల్టులు, టైలు అందజేత

**చిలకలగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం వారాసిగూడకి చెందిన వ్యాపారి యాదగిరి విద్యార్థులకి బెల్టులు, టైలు అందజేసి, మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత శిఖరాలకి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సంజీవ్

## కంటోన్మెంట్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

● ఎం.సంజీవ్

**మారేడుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** బీజేపీ కాంగ్రెస్ పార్టీలో వారి స్వార్థం కోసమే జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్‌ను విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ, నాటకాలు ఆడుతూ ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధి పనులను విస్మరిస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సంజీవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోనే పికెట్ చౌరస్తాలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ.... కంటోన్మెంట్‌లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కాంగ్రెస్ పార్టీ, బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేపట్టడంలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు 500కోట్లు కేటాయించడం, అదేవిధంగా కంటోన్మెంట్‌కు కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి కూడా రక్షణ శాఖ నుంచి కంటోన్మెంట్ విభాగం నుంచి ప్రత్యేక నిధులు మళ్ళించి ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా రెండు పార్టీలు నాటకాలు ఆడటం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. కంటోన్మెంట్ అభివృద్ధి జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన అన్నారు.



ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి



భోజనాలు చేస్తున్న భక్తులు



కల్యాణం తిలకిస్తున్న శివసత్తులు

# వైభవంగా కల్యాణం

● ఎల్లమ్మ నామస్మరణతో మార్మోగిన బల్కంపేట ● లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం ● జనసంద్రంగా పురవీధులు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఏ దిక్కున చూసినా అమ్మవారి భక్తులే... కొందరు వంటినిండా.. మరికొందరు నుదుటన పసుపు బండారుతో.. బల్కంపేట పురవీధుల్లో దర్శనిమిచ్చారు. శివసత్తులు, మహిళలు, మరోవైపు యువతీయువకులు, పిల్లలు అమ్మవారి భక్తిలో మునిగితేలారు. దీంతో బల్కంపేటలోని ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం జాతరను తలపించింది. ఉదయం నుంచే బల్కంపేట వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. ఎల్లమ్మ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మరోవైపు కల్యాణోత్సవాన్ని ఆలయం ముందు ఆరుబయట నిర్వహించడంతో నాలుగు వైపులా రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివసత్తులు, ఒగ్గుకళాకారులు ప్రత్యేకవేదికలను ఏర్పాటు చేసుకొని అమ్మవారి భక్తిసాగరంలో మునిగిపోయారు. శివసత్తులు చెర్నకోలలు చేతబూని అమ్మవారి పూనకంతో ఊగిపోయారు.

(అమీర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి)



ఎల్లమ్మతల్లి కల్యాణాన్ని వీక్షిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మేయర్ విజయలక్ష్మి, డాక్టర్ కోట నీలిమ తదితరులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు



బోనంతో వస్తున్న జోగిని శ్యామల



అలంకరణలో ఎల్లమ్మతల్లి, వరుడుగా త్రిశూలానికి అలంకరణ

### తీవ్ర ట్రాఫిక్‌జామ్

ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు, భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంజీవరెడ్డినగర్ పోలీస్‌స్టేషన్ వైపు నుంచి బల్కంపేటవైపు వచ్చే రోడ్డులో ఎస్ఎస్ బేకరీ నుంచి ఎడమవైపు ట్రాఫిక్‌ను మళ్లించి, అక్కడి నుంచి బీకే.గూడ పార్కు చౌరస్తా, శ్రీరాంనగర్ మీదుగా బల్కంపేట పెట్రోల్ బంకు వైపు ట్రాఫిక్‌ను అనుమతించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడం, రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు తలెత్తాయి. అదేవిధంగా అమ్మవారి కల్యాణోత్సవం అనంతరం బుధవారం సాయంత్రం రథోత్సవం ఊరేగింపు ఉంటుందని, వందలాది మంది పాల్గొనే ఈ రథోత్సవం రోజు ట్రాఫిక్ వన్‌వే చేస్తామని ట్రాఫిక్‌పోలీసులు తెలిపారు.

### అన్నదానం, పులిహోర పంపిణీ

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి వచ్చిన లక్షలాది మంది భక్తులకు స్థానిక సంక్షేమ సంఘాలతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా రోడ్ల పొడవునా టెంట్లువేసి ఉచితంగా అన్నదానం, పులిహోర, మంచినీటి ప్యాకెట్లను, స్వీట్లను పంపిణీచేశారు. ఎల్లమ్మపోచమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటుచేసి భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

### మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటు

ఎల్లమ్మ కల్యాణానికి వచ్చే భక్తులు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా పలు ప్రాంతాల్లో మొబైల్ టాయ్‌లెట్లను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ ప్రాంతాలు అపరిశుభ్రం కాకుండా జాగ్రత్త పడ్డారు. ఈసారి జరిగిన కల్యాణానికి లక్షల్లో భక్తులు వచ్చినట్లు పోలీస్, వివిధ శాఖల అధికారులు అంచనా వేస్తున్నారు.



ఎస్ఆర్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ



పోతరాజుల విన్యాసం



రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న టీటీడీపీ కార్యదర్శి జనగామ నర్సింగరావు



టీఐటీ బ్లాక్స్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో డాక్టర్ కే.నరసింహన్



రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పాల్గొన్న గుంటి కృష్ణ, చంద్రశేఖరరావు తదితరులు

# ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

**సికింద్రాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ అన్నానగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. అన్నానగర్, అర్జున్‌నగర్, బాలంరాయి, అంబేడ్కర్‌నగర్, రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, మాజీ సభ్యుడు దేవులపల్లి శ్రీనివాస్, శ్యాంరెడ్డి, కుమార్, ముదిరాజ్, కమిటీ సభ్యులు కుమార్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, నర్సింహగౌడ్, రామచందర్‌గౌడ్, కృష్ణ, నాగరాజ్‌లు అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

### బొల్లారంలో ..

**తిరుమలగిరి:** బొల్లారం బజార్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం పుష్పార్చన లాంటి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు



అన్నదానం చేస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్

చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా మహిళలు చిన్నారులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జనగామ నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్నదానం కోసం 10వేల రూపాయలను విరాళంగా అందజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్, రాజేష్, సంజీవ, యాదగిరి, సుధాకర్, సుదర్శన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీఐటీ బ్లాక్స్ వద్ద రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కల్యాణ మహోత్సవ వేడుకలు కనులపండువగా జరిగాయి. ముఖ్య అతిథిగా



అమ్మవారికి పూజలు చేస్తున్న దేవులపల్లి శ్రీనివాస్ తదితరులు

టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జీ.వీ.బాల్‌రాజ్, సుశీల్, పూర్ణచందర్, సతీష్, వినోద్ పాల్గొన్నారు.

**చిలకలగూడ :** మెట్టుగూడ డివిజన్, పాండవ బస్తీలో మంగళవారం ఎల్లమ్మతల్లి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కట్టమైసమ్మ దేవాలయం చైర్మన్ గుంటి కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు మేకల చంద్రశేఖరరావు, నందు, జాక్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యంతో సాధికారత సాధించొచ్చు

● ఎమ్మెల్యే శ్రీగణేష్

**తిరుమలగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** మహిళలకు వృత్తి నైపుణ్యం అందించడం ద్వారా వారు సాధికారత సాధించవచ్చని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం లాల్‌బజార్ గాంధీనగర్‌లోని హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ కార్డినల్ పూల ఆంథోని ఏర్పాటుచేసిన హెస్ కుట్టుమిషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. మహిళల కోసం మరిన్ని నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల కోసం నియోజకవర్గంలో కుట్టుమిషన్ కేంద్రాలని ఏర్పాటు



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

చేయడానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రదీప్, రంజిత్, నాగనేని సరిత, భవాని, ఆంథోని, జోసఫ్, సన్నీ, ప్రభు, సాంసన్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన బ్రాహ్మణ సేవావాహిని అధ్యక్షుడు

**అడ్డగుట్ట :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మంగళవారం ఆయన నివాసంలో బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులతోపాటు సభ్యుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి పూజారులు ఆశీర్వదించారు. బ్రాహ్మణపరిషత్ పథకాలు త్వరగా అమలు చేసేవిధంగా కృషిచేయాలని పూజారులు ఎమ్మెల్యేను కోరారు. రాష్ట్ర కమిటీ నాయకులు వెంకటేశ్వర శర్మ, సీతారామ శాస్త్రి, కొండపల్లి రాకేష్ కుమార్, వెంకటేశ్వరరావు, వెంకట సుధాకర్‌రావు, పవన్ కుమార్, శేషం శ్రీకర్, రంగాధాం, శ్రీనివాస్ శర్మలు ఉన్నారు.



అంటోనీని శాలువాతో సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## బాక్సింగ్ బంగారు పతకం విజేతకు సత్కారం

**పద్మారావునగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** జాతీయ స్థాయిలో ఆటోడ్రైవర్ కుమారుడు రాణించడం అభినందనీయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. యువశక్తి ఆటో డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అయినటువంటి ఆటో డ్రైవర్ విజయ్‌కుమార్ కుమారుడు అంటోని బాస్ టోని హర్యానాలో ఇటీవల జరిగిన బాక్సింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో జూనియర్ 18అండర్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటోనికి శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపి మరింతగా రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ టి.రాజశేఖర్ రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి):** రైలు పట్టాలు దాటుతున్న ఓ మహిళను రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బొల్లారం యార్డు సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని 40ఏళ్ల మహిళను రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించింది. విషయాన్ని రైలు లోకోపైలెట్ నవీన్‌కుమార్ వెంటనే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్టేషన్ మాస్టర్ సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అదుకున్న రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బేగంపేట్ నేచర్ క్యూర్ ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.